ఉత్సవ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని మఠం పంచాయతీ గ్రామంలో వచ్చే నెల 7,8,9 తేదీల్లో జరిగే మహా శివరాత్రి ఉత్సవ కమిటీ ఎన్నిక ఆదివారం మత్స్య గుండం దేవాలయం వద్ద ఏక గ్రీవంగా ఎన్నికైందని ఆలయ కమిటీ పెద్ద మఠం సూర్యనారాయణనాయుడు తెలిపారు. ఉత్సవ కమిటీ చైర్ పర్సన్‌గా మఠం పంచాయతీ సర్పంచ్ మఠం శాంత కుమారి, ఉత్సవ కమిటీ అధ్యక్షులు గా మినుముల గోపాల పాత్రుడు, ప్రధాన కార్యదర్శిగా పాంగి మత్స్య కొండబాబు, ఉపాధ్యక్షులుగా వంతల ఈశ్వర్, కోశాదికారిగా తమర్భ భీమ్ బాబు, సహ కోశాధికారిగా మఠం రాంబాబు నాయుడు, కార్యదర్శులుగా అంగనైని ఆనంద్, చెట్టి హరినాథ్, మఠం ఈశ్వర్ నాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు గా సత్యనారాయణ, శ్రీనివాస్ నాయుడు, సతీష్ తదితరులు ఎన్నికయ్యారని తెలిపారు. మూడు రోజులు పాటు జరిగే జాతరను విజయవంతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు తమర్భ అప్పారావు, మఠం చంద్ర శేఖర్ నాయుడు, మఠం కేశవరావు నాయుడు, మఠం సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టులు ఇలా..వెళ్లేది ఎలా...

-భయం..భయంగా గిరిజనుల రాకపోకలు- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -హుకుంపేట: **మండంలో తుపాను ప్రభావంతో కల్వర్టులు కోతకు గురై మరమ్మతులు నోచుకోని పరిస్థితి నెలకొంది. దీంతో, ప్రమాదాలకు నిలయంగా మారాయి. వాహనదారులు, పాదచారులు ప్రాణాన్ని గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. ఈ సమస్య పరిష్కారానికి నోచుకోక పోవడంతో గత్యంతరం లేని పరిస్థితిలో పలు చోట్ల గిరిజనులులే మరమ్మతులు చేపడుతున్నారు.**

అడ్డుమండలో..

మండలంలోని బి.బొడ్డపుట్టు పంచాయతీ బొర్ర మామిడి గ్రామంలో బాకూరు ఉప్పు ప్రధాన రహదారిలో నవంబర్ నెలలో తుపాను ప్రభావంతో కూలి పోయింది. 1994 సంవత్సరంలో కల్వర్టు నిర్మాణం చేపట్టారు. నేటికి 30 సంవత్సరం అవుతోంది. ఇదే రహదారి అనుకుని 10 పంచాయతీల గిరిజనులు రాకపోకలు సాగిస్తున్నారు. చెంత, బాకూరు, బి.బొడ్డ పుట్టు, మత్స్యపురం, పట్టాం, గత్తుం, బూర్జ పంచాయతీ లతో పాటుగా అనంతగిరి మండలం పినకోట, పెద్దకోట, దేవరపల్లి పంచాయతీల గిరిజనులు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటారు. సుమారు 30 గ్రామాల ప్రజలకు ఇదే రహదారి. నిత్యం వందలాది మంది ప్రయాణిస్తుంటారు. రెండు మండలాలతో పాటుగా ఎస్.కోట, విశాఖపట్నం వేళ్లేందుకు ఇదే సులువైన రహదారి. తుఫాను ప్రభావంతో కల్వర్టు కొట్టుకు పోవడంతో భయంతో ప్రాణాలు గుపెట్లో పెట్టి సాగిస్తున్నారు.

ఇదిలా ఉండగా అడ్డుమాండ పంచాయతీ అడ్డుమాండ గ్రామ సమీపంలో కల్వర్టు కోతకు గురైంది. 1980 సంవత్సరంలో కల్వర్టు నిర్మాణం చేపట్టారు. తర్వాత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2020 నూతన కల్వర్టు ఏర్పాటు చేసినా నాణ్యత లోపంతో కుల్వర్టు కూలి పోయంది. దీంతో, గత్యంతరం లేని పరిస్థితిలో పాత కల్వర్టు మార్గం గుండా ప్రయాణం సాగిస్తున్నారు. ద్విచక్ర వాహనాలే మాత్రమే రాకపోకలు సాగిస్తున్నాయి. చెక్ పోస్టు వెళ్లె ప్రధాన రహదారి ఇది. హుకుంపేట మండలంలోని 3 పంచాయతీలు అడ్డుమండ, గడికించుమండ, భరమసితో పాటు హుకుంపేట, పాడేరు రెండు మండలాల ప్రజలు చోడవరం, వడ్డాది, విశాఖపట్నం నిత్యం వందలాది మంది ప్రయాణిస్తుంటారు. కల్వర్టు దెబ్బతిని నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేయలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో, ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని పలువురు కోరారు.

కల్వర్టు మరమ్మతు చేపట్టాలి

బాకూరు ఉప్పు రహదారి కల్వర్టు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. ఇదే రహదారి గుండా నిత్యం రాకపోకలు సాగిస్తున్నాం. ఏ కల్వర్టు ఎప్పుడు కూలి పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. నూతన కల్వర్టు ఏర్పాటు చేయాలి. ఈ మార్గం గుండా గిరిజులు అనునిత్యం రాకపోకలు సాగిస్తున్నారు.

బి.పండు
గిరిజనుడు

బాకూరు - ఉప్ప ప్రధాన రహదారిలో కూలిన కల్వర్టు

గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో

టెన్త్‌లో శత శాతం ఫలితాలపై ప్రత్యేక దృష్టి

'ప్రజాశక్తి'తో జిల్లా గిరిజన సంక్షేమ (విద్య) శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావు

ప్రజాశక్తి -పాడేరు:

పాడేరు ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది టెన్త్ లో నూరు శాతం ఫలితాలు సాధన కోసం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామని జిల్లా గిరిజన సంక్షేమ విద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావు వెల్లడించారు. గిరిజన సంక్షేమ విద్యారంగంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజాశక్తి కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపిన సమాచారం ఆయన మాటల్లోనే.

పది పరీక్షలకు చేపడుతున్న చర్యలు?

ఆశ్రమాల్లోని పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. 90 రోజుల కార్యాచరణ ప్రణాళికతో జనవరి 5 నుంచి 108 ఆశ్రమ పాఠశాలల్లో ప్రత్యేక బోధన అభ్యాసన కార్యక్రమాలు చేపట్టాం. ప్రతిరోజు సబ్జెక్ట్ టీచర్లతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

విద్యార్థులకు ప్రతిరోజు పరీక్ష నిర్వహించే విధానం, వారానికి ఒక రోజు సమీక్ష నైట్ స్టడీ నిర్వహిస్తు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

హాజరవుతున్న విద్యార్థులు

పాడేరు ఏజెన్సీలోని 108 ఆశ్రమ పాఠశాలల నుంచి 2034 మంది బాలికలు, 3042 మంది బాలురు చొప్పున మొత్తం 5 వేల 76 మంది పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

సిఆర్టీల రెగ్యులరైజేషన్

ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు నిబంధనలను అనుసరించి పాడేరు డివిజన్ 11 మండలాల పరిధిలో పనిచేస్తున్న 475 మంది సిఆర్టిలకు గాను, అర్హులైన 268 మంది సిఆర్టిల సర్వీస్ క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఇందులో ప్రస్తుతం జీఎస్‌జిటి స్కూల్ అసిస్టెంట్ పిఈటి పీడీలుగా పనిచేస్తున్న వారు కూడా ఉన్నారు.

కొత్తగా చేపడుతున్న పథకాలు?

ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న బాలురు, బాలికల్లో రక్తహీనత, సికిల్ సెల్ ఎనీమియాను గుర్తించేందుకు ప్రభుత్వం సర్వే నిర్వహిస్తోంది. విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు పైలెట్ ప్రాజెక్టు కింద అరకు, పాడేరు, జీకే వీధి, చింతపల్లి మండలాల్లో ఐదు బాలికల ఆశ్రమ పాఠశాలలను ఎంపిక చేసి మెడిసినల్, ఫుడ్ అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.చాక్లెట్ తరహాలో ఉండే వీటిని 3 నెలల పాటు బాలికలకు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

భద్రతా చర్యలు

40 బాలికల ఆశ్రమ పాఠశాలకు కొత్తగా భద్రత చర్యల్లో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.దీంతో, నిఘా కలుగుతుంది.

'చలో విజయవాడ'కు వెళ్లకుండా

సిఐటియు నేత గృహ నిర్బంధం

ప్రజాశక్తి- చింతూరు : విద్యుత్తు కాంట్రాక్ట్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 12న చలో విజయవాడ ఆందోళనకు వెళ్లకుండా సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్‌ను ఆదివారం పోలీసులు గృహనిర్బంధం చేశారు. చింతూరులోని ఎర్రంపేట లోని పల్లపు వెంకట్ ఇంటికి వెళ్లి, అతనిని అదుపులోకి తీసుకున్నారు.

పోలీసుల అదుపులో ఉన్న వెంకట్

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయడంతోపాటు తెలంగాణ మాదిరిగా వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఈనెల 12న చలోవిజయవాడ ఆందోళనకు విద్యుత్ కార్మికుల పోరాట కమిటీ పిలుపునిచ్చింది. విజయవాడలో శాంతియుత ధర్నా అయినా అనుమతి లేదంటూ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్‌ను విజయవాడ ధర్నాకు వెళ్లకుండా పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ, ఉద్యోగులు, కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చాలా దుర్మార్గంగా నియంతలా వ్యవహరిస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయమంటే పోలీసులతో నిర్బందిస్తోందన్నారు. ప్రభుత్వం చర్యలను ఖండించిన వెంకట్, ఇదే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

యువతకు ప్యాకేజీ హుళక్కేనా..!

ప్రభావిత గ్రామాల్లో అర్ధాంతరంగా ఆగిన ఇళ్ల నిర్మాణాలు

కటాఫ్ డేట్ విషయంలో బాధితుల ఆవేదన
మూడేళ్లు దాటితే రీనోటిఫికేషన్ నిబంధనకు తూట్లు
- నిరాశ, నిస్పృహలలో పోలవరం నిర్వాసిత యువత

నిర్వాసిత గ్రామాల్లో నివాసానికి దూరంగా ఉంటున్న గిరిజనుల ఇళ్లు

ప్రజాశక్తి - విఆర్.పురం: పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో నిర్వాసిత కుటుంబాల్లోని 18ఏళ్లు నిండిన వారికి ప్యాకేజీ అమలు ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్ర ప్రయోజనాల కోసం నిర్మిస్తున్న ప్రాజెక్ట్‌కు తాము అస్తులు, భూములు, సర్వం ధారపోసి నిలువనీడలేని నిర్వాసితులుగా మారితే, తమ పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరి దుర్మార్గమని వీరంతా ఆవేదన చెందుతున్నారు.

ఎప్పుడో 2017లో జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఇప్పుడు పరిహారం ఇస్తున్నారు. దానినేకటాఫ్ డేట్ గా నిర్ణయించి సర్వే చేసి పరిహారం ఎవరికి ఇవ్వాలో నిర్ణయిస్తున్నారు. దీంతో అప్పటికి 18ఏళ్లు నిండని వారికి, ఇపుడు ఏడేళ్ల తర్వాత ఆ వయస్సు దాటినా ప్యాకేజీ అందని పరిస్థితి ఉండడం చాలా దారుణం ఆవేదన చెందుతున్నారు. 2017నాటికి 18ఏళ్లు నిండకపోయినా, ఇపుడు 2024 నాటికి ఎంతో మంది యువతీ,యువకులు వయోపరిమితి దాటి ఉన్నారు.వారికి ఉండడానికి ఇల్లు లేదు. భవిష్యత్ లో ఇల్లు నిర్మించుకుందామంటే స్థలం ఉండదు, పోలవరం ప్రాజెక్టులో సర్వం కోల్పోవడంతో వారికి ఆర్థికభరోసా కూడా లేదు. ఇలా అన్నింటికీ చెడి, రోడ్డున పడే దుస్థితి నెలకొని ఉందని వారంతా మనోవేదనకు గురౌతున్నారు.

భూసేకరణ, పునరావాసం,ప్యాకేజీల .చట్టం ప్రకారం నోటిఫికేషన్ వచ్చి మూడేళ గడిచిన తర్వాత దాన్ని అమలు చేయలేని పరిస్థితి ఉంటే, రీ నోటిఫికేషన్ జారీ చేసి, కొత్తగా గ్రామాల్లో సర్వే చేసి, గ్రామసభలను నిర్వహించి, అప్పటికి అర్హులైన వారిని లబ్ధిదారులకు గుర్తించి, పరిహారం, ప్యాకేజీ ఇవ్వాల్సి ఉంది. ఇదే విషయమై గతేడాది వరద ముంపు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ముఖ్యమంతి జగన్మోహనరెడ్డి చింతూరు మండలం కల్లేరు గ్రామంలో ప్రకటించారు. అయితే ముఖ్యమంత్రి ఇచ్చిన మాట అమలులో ఒక్కడుగు కూడా ముందుకు పడలేదు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు, పునరావాసం, ప్యాకేజీలపై 2006 నుంచి నేటివరకు బాధితుల పక్షాల సిపిఎం పోరాటం చేస్తూనే ఉంది.ఎన్నో రకాల ఉద్యమాలు, పాదయాత్రలు, బహిరంగ సభలు, రౌండ్ టేబుల్ సమావేశాలు, ఢిల్లీలో ధర్నాలు, రాష్ట్రపతిని కలిసే ప్రయత్నం వంటి ఎన్నో రూపాల్లో ఉద్యమిస్తోంది. పోలవరం ముంపు ప్రాంతాల్లో సిపిఎం రాష్ట్ర, దేశ నాయకులు పర్యటించారు. భద్రాచలంలో అప్పటి ఎమ్మెల్యే సున్నం రాజయ్య నాయకత్వంలో జరిగిన నిరసనలో ఆందోళన కారులపై పోలీసు కాల్పులు వంటి ఘటనలు మరువలేనివి. ఇన్ని జరుగుతున్నా బాధితులకు న్యాయం జరగడం లేదు. నేతలిచ్చిన హామీలన్నీ నీటిమూటలుగానే మిగిలిపోతున్నాయని ఆవేదన చెందుతున్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం

చింతూరు : భద్రాచలం శ్రీ సురక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో చింతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని చింతూరు ఎస్ఐ శ్రీనివాస్ ప్రారంభించారు. ఏజెన్సీలోని గిరిజనులకు శ్రీసురక్ష ఆసుపత్రి జనరల్, క్రిటికల్ కేర్ వైద్య నిపుణులు డాక్టర్ అక్కినేని లోకేష్, గైనకాలజిస్ట్ సూరపనేని శ్రీక్రాంతి అందిస్తున్న సేవలను ఎస్ఐ కొనియాడారు.

రోగులను పరీక్షిస్తున్న సురక్ష వైద్యులు

ఈ సందర్భంగా 250 మందికి ఉచితంగా గుండె సంబంధిత ఇసిజి, హెచ్‌బి, సిజిబి రక్తపరీక్షలు, మధుమేహ పరీక్షలునిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.అనంతరం వైద్యులు అక్కినేని.లోకేశ్, సూరపనేని.శ్రీక్రాంతి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతోనే భద్రాచలంలో సురక్ష మల్టీస్పెషల్టి హాస్పిటల్‌ను ప్రారంభించామన్నారు కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజర్ కొప్పుల మురళి, సిబ్బంది, గ్రామీణ వైద్యులు హనీఫ్, సాయి , సాగర్, రాజు , మహేష్ పాల్గొన్నారు.

ధర లేక కూరగాయల రైతులు దిగాలు

రోజంతా పడిగాపులు పడినా అమ్ముడుపోని సరుకులు ... సీలేరు వారపుసంతకు వచ్చిన గిరి రైతుల్లో నిరాశ

కొనే వారి కోసం సీలేరు సంతలో ఎదురుచూస్తున్న గిరిజన రైతులు

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు వారపు సంతకు కూరగాయలు తెచ్చిన గిరిజన మాలీలు గిట్టుబాటు ధర లేక వ్యాపారాలు సాగక, పట్టుకొచ్చిన కాయగూరలు అమ్ముడుపోక దిగులు చెందారు. దుప్పిలివాడ, కాట్రగెడ్డ, చల్లని శిల్పతో పాటు ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో క్యాబేజీ, కాలీఫ్లవర్, వంకాయలు, చిక్కుళ్ళు ముల్లంగి,వంటి కూరగాయలను పండించిన గిరిజన రైతులు, వాటిని సీలేరు వారపు సంతకు తెచ్చి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం వారపు సంతకు గిరిజనులు, కొనుగోలుదారుల రాక తగ్గడంతో కూరగాయలు తెచ్చిన వ్యాపారులకు శాపంగా మారింది. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరుగంటలు పొద్దుపోయే వరకు పడిగాపులు పడినా, అవి అమ్ముడుపోకపోవడంతో తెచ్చిన వాటిని యథాతథంగా వెనక్కు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు

ఈఏడాది అకాలవర్షాల కారణంగా పంటలు పూర్తిగా దెబ్బ తినడంతో, చేతిలో సొమ్ము లేక దారకొండ గుమ్మరేవులు దుప్పిలివాడ పంచాయతీ గ్రామాల నుంచి గిరిజనులు సీలేరు వారసంతలకు రావడం లేదు. కూనవరం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులతో పాటు జీకే వీధి మండల పరిధిలో పండించిన గిరిజన సైతం వారసంతలు కాయగూరలు విరివిగా తెచ్చినప్పటికీ, కొనుగోలుదారులు లేక వ్యాపారాలు జరగలేదని వారంతా గగ్గోలు పెడుతున్నారు

పెట్టుబడులు లేని పరిస్థితుల్లో అప్పులు చేసి పండించామని, తీరా ఇపుడు ధర, కొనేవారు లేకపోవడంతో నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. చేసిన అప్పులు, వాటి వడ్డీలను తీర్చడమెలాగని కలవర పడుతున్నారు. ప్రభుత్వమే నేరుగా తాము పండించిన కూరగాయలును కొనుగోలు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నారు. ఎకరాకు రూ.20వేలు నుంచి రూ.30వేలు వరకు పెట్టుబడులు పెట్టామని, ఇపుడు ధర లేక నష్టపోతున్నామని వాపోతున్నారు..ఈ ఏడాది వరి, అపరాలు పంటలు పండక తీవ్రంగా నష్టపోయామని, కూరగాయలు ఆశాజనకంగా ఉండడంతో అప్పులు, కష్టాల నుంచి గట్టెక్కుతామని భావించినా, గిట్టుబాటు ధర, కొనేవాళ్లు లేక కష్టాలనుంచి గట్టెక్కే పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోకుంటే, తాము అప్పుల ఊబిలో కూరుకుపోవడం ఖాయమని అంటున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి

వేలకు వేలు అప్పులు చేసి కూరగాయల పండించా. ఇపుడు ధర లేక, కొనేవాళ్లు కానరాక నష్టపోయే పరిస్థితి ఉంది. గిరిజన .రైతులు పండించిన పంటలను ప్రభుత్వమే నేరుగాకొనుగోలు చేసి ఆర్థికంగా ఆదుకోవాలి.

కొర్ర పితాంబరు,
దుప్పులవాడ పంచాయతీ, . జీకే వీధి మండలం

పెట్టుబడులు రాని పరిస్థితి

పండించిన కూరగాయలకు గిట్టుబాటుధర లేక, కొనేవాళ్లు కరువై కనీసం పెట్టుబడులైనా రాని పరిస్థితి ఉంది. వారపుసంతలకు ప్రైవేటు వాహనాల్లో తీసుకెళ్లి, రోజంతా పడిగాపులు పడినా అమ్ముడుపోవడం లేదు. జీవనోపాధి కష్టమౌతోంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

కొర్ర సదం, గిరిజన రైతు
దుప్పులవాడ పంచాయతీ, జీకే వీధి మండలం

గిరిజనులకు తప్పని డోలీ కష్టాలు

డోలీలో తరలిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి -అనంతగిరి: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదిమా జాతి పివిటిజి గిరిజన ప్రజలకు అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నట్లు ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి తప్ప ఆచరణలో అమ్మలు కాలేదు. దీంతో, మారుమూల గిరిజన గ్రామాల్లో కనీసం రోడ్డు సౌకర్యాలు లేక రోగులు, బాలింతలు, గర్భిణీలకు డోలి కష్టాలు తప్ప లేదు. వివరాలు.. అనంతగిరి మండలం మారుమూల పెద్దకోట పంచాయతీ పరిధి ఆదిమ జాతి పివిటిసి మద్రేబు గ్రామానికి చెందిన కొండతాబేలి లింబో అనే గిరిజనుడు గత వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు గ్రామం నుండి దట్టమైన అటవీ ప్రాంతం కొండ కోనల నడుమ సుమారు 10 కిలోమీటర్ల దూరం దుప్పటి డోలి కట్టి తునిసిబు గ్రామం రోడ్డులో చేర్చారు. అక్కడి నుండి ప్రథమ చికిత్స నిమిత్తం పాడేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యులు రోగికి చికిత్స అందించడంతో ఆరోగ్య పరిస్థితి కుదుటపడింది. అనంతరం ఆసుపత్రి నుండి తునిసిబు గ్రామం వరకు ప్రైవేటు వాహనంలో తరలించి అక్కడ నుండి కుటుంబ సభ్యులు మద్రేబు గ్రామం వరకు డోలి సాయంతో తిరిగి తరలించారు. గ్రామానికి కనీసం రోడ్డు సౌకర్యం కల్పించాలని ఈనెల 14వ తేదీన ఉమ్మడి విశాఖ జిల్లాలో జరిగే జిల్లా పరిషత్ సమావేశంలో ఆందోళన చేపడతామని పివిటిజీ సంఘం జిల్లా అధ్యక్షులు, సిపిఎం కార్యవర్గ సభ్యులు కె.గోవింద్ తెలిపారు.

మాట్లాడుతున్న బాలరాజు

ఓటు హక్కును ఉపయోగించుకోండి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ఉపయోగించు కోవాలని వరల్డ్ హ్యూమన్ రైట్స్ నేషనల్ చైర్మన్ రావూరి బాలరాజు కోరారు. మండలంలోని కొర్రాయి పంచాయతీ జామ్‌గుడ గ్రామంలో ఆ పంచాయతీ సర్పంచ్ పి.కొములు ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ దేశాలలో ఉన్న ప్రతి దేశం కూడా ప్రపంచదేశాల మానవ సంబంధాలకు సంబంధించి డిక్లరేషన్ 1952వ సంత్సరంలో ఎప్పుడైతే పొందుపరచబడిందో ప్రపంచ దేశాల వాలు మొత్తం కలిసి ఐక్యరాజ్య సమితి ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఐక్యరాజ్యసమితి ఆదేశాల మేరకు మేము పనిచేయడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ మానవ హక్కుల అవగాహన కలిగివుండలని, ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడు ఓటు వినీయోగించు కోవాలన్నారు. అనంతరం ప్రపంచ హ్యూమన్ రైట్స్ ఆక్టివిటీ క్యాలండర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి బురిడీ విక్రందేవ్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో హెల్త్ క్యాంపు నిర్వహించాలని చైర్మన్‌ను కోరామన్నారు. గిరిజన గ్రామాలలో సమస్యలు హ్యూమన్ రైట్స్ ద్వారా పరిష్కారం చేయాలనీ కోరామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాముగూడ స్కూల్ పదవ తరగతి పబ్లిక్ ఎగ్జామ్స్ సామగ్రి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఎడ్యుకేషన్ వింగ్ చైర్మన్, ఎడ్యుకేషన్ వింగ్ కార్యదర్శి, ఎగ్జిక్యూటీ మెంబర్ పప్పు సన్యాసినాయుడు, మండల ప్రెసిడెంట్ జగన్నాధం, వినయోగదారుల సంఘ అధ్యక్షులు చిట్టిబాబు, దిశ పౌండేషన్ అధ్యక్షులు సరస్వతి, గిరిజనులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కళారూపాలతో ఆకట్టుకున్న విద్యార్థులు

ఘనంగా శ్రీ శివశంకర్ విద్యా సంస్థల వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శ్రీ శివ శంకర్ విద్యా సంస్థలు ప్రారంభించి 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవ వేడుకలను పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ ఎంవి.సుధ ఆధ్వర్యంలో మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జనసేన నగర అధ్యక్షులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో విద్యాలయాల పాత్ర కీలకమైనదన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండే నైజం వున్న సుధాఅప్పారావు దంపతులను ఈ సందర్భంగా అభినందించారు. మరొక అతిథి రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు గొండు సీతారాం మాట్లాడుతూ ప్రతిఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తూ అత్యుత్తమ విద్యను అందిస్తున్న శ్రీ శివశంకర్ విద్యా మందిర్ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ డి.రాంబాబు, వైసిపి నాయకులు మొల్లి అప్పారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఆదివాసీలకు అన్యాయం చేస్తే ఊరుకోం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాజకీయ పార్టీలు వారి స్వార్థం కోసం నకిలీ గిరిజనులకు సీట్లు కేటాయించి, అసలైన ఆదివాసీలకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని జనజాతి సురక్ష మంచ్ రాష్ట్ర కన్వీనర్ ఉబ్బేటి నాగేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ అయినా గిరిజనులకు రిజర్వ్ చేసిన స్థానాలలో స్థానిక గిరిజనులకు కాకుండా నకిలీ సర్టిఫికెట్లతో గిరిజనులుగా చలామణీ అవుతూ బయట ప్రాంతాల నుంచి వచ్చిన వారికి, గిరిజనేతరులకు బినామీలుగా వ్యవహరిస్తున్న వారికి, గిరిజనేతరులను పెళ్లి చేసుకొని గిరిజన ఆచార సాంప్రదాయాలు విడినడినటువంటి వారికి సీట్లు ఇవ్వవద్దని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ క్రాంతిరాజ్ పాల్గొన్నారు.

రైట్ టు హెల్త్ బిల్లు తీసుకురావాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రైట్ టు హెల్త్ బిల్లును తీసుకురావాలని ప్రజా ఆరోగ్య వేదిక గౌరవ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కెవిఎస్.సాయి ప్రసాద్, టి.కామేశ్వరరావు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు. లేఖలోని అంశాలను వారు ఆదివారం మీడియాకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మొదట్లో ఆరోగ్య రంగంలో ముఖ్యమంత్రి జగన్ నాయకత్వంలో చేపట్టిన సంస్కరణలకు జన్ స్వస్థ అభియాన్ (జెఎస్ఎ) అనుబంధ సంస్థ అయిన ప్రజా ఆరోగ్య వేదిక అభినందనలు తెలియజేసిందని తెలిపారు.

రాజస్థాన్ ప్రభుత్వం 2023లో అశోక్ గెహ్లాట్ నేతృత్వంలో తీసుకొచ్చిన ఆరోగ్య హక్కు బిల్లుపై ముఖ్యమంత్రి దృష్టి సారించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో తాము ఆరోగ్య హక్కు ప్రతిపాదిత బిల్లుపై సమగ్ర చర్చలు, సమావేశాలు నిర్వహించామని లేఖలో పేర్కొన్నారు. అలాగే ఈ బిల్లుపై ప్రజల నుంచి ముఖ్యంగా వైద్యులు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, ఇతర మేధావుల నుంచి అభిప్రాయాలు, సూచనలను తీసుకున్నామని తెలిపారు. ఇన్ని చర్చల తర్వాత రాష్ట్రంలో కూడా ఈ బిల్లు తీసుకురావాలని వారంతా ఆకాంక్షిస్తున్నట్టు లేఖ ద్వారా ముఖ్యమంత్రికి తెలిపారు. అటువంటి చట్టాన్ని తీసుకురావడం ద్వారా ఆరోగ్య హక్కును సాధించవచ్చని, ఇది సామాన్య ప్రజలకు గొప్ప ఊరటనిస్తుందని లేఖలో అభిప్రాయపడ్డారు. కాబట్టి ఆరోగ్య హక్కు ప్రతిపాదిత ముసాయిదా బిల్లు తీసుకురావడానికి రాజస్థాన్ బిల్లును కూడా జతపరిచామని వారు తెలిపారు. లేఖను పరిశీలించి రైట్ టు హెల్త్ బిల్లు ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఏళ్ల తరబడి మూత

-కోవిడ్ నుంచి సబ్బుల ఉత్పత్తి నిలిపివేత
-పట్టించుకోని అధికారులు
-ఇదీ జిసిసి సబ్బుల తయారీ కేంద్రం దుస్థితి

మూతపడిన జిసిసి సబ్బుల తయారీ కేంద్రం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయలో గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఆధ్వర్యంలో నడుస్తుల సబ్బుల తయారీ కేంద్రం మూతపడింది. 2022 నుంచి ఈ సబ్బుల తయారి కేంద్రంలో ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించ లేదు. అప్పటి నుంచి తాళాలు వేసి ఉంది. అప్పటికే లక్ష వరకు సబ్బుల నిల్వల స్టాకుతో మూతపడింది.
గిరిజన సహకార సంస్థ(జీసీసీ) అధ్వర్యంలో 2008వ సంవత్సరంలో అరకులోయలో 'సోప్ యూనిట్'ను (సబ్బుల తయారీ కేంద్రం) ఏర్పాటు చేశారు.గతంలో ఇక్కడ తయారు చేసిన సబ్బులను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాలకు, గురుకులం పాఠశాల వసతి గృహాలకు సరఫరా చేసేవారు. ఇంకా జీసీసీ డీఆర్ డిపోలకు కూడా సబ్బులు సరఫరా చేసేవారు. దీంతో, 2012లో సోప్ యూనిట్‌ను విస్తరించి నెలవారీ ఉత్పత్తి సామర్థ్యాన్ని రెండు లక్షల సబ్బులకు, 2020లో మూడు లక్షల సబ్బుల తయారీకి పెంచారు. ఈ సబ్బులో వివిధ రకాల నీమ్ (వేప), అలోవేరా (కలబంద), టర్మరిక్ (పసుపు), జాస్మిన్ (మల్లె) రకం సబ్బులు తయారు చేసి సరఫరా చేసేవారు. 2020 మార్చిలో కోవిడ్-19 రావడంతో నెలల తరబడి మూసేశారు.
అదే ఏడాది రాష్ట్ర ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని ప్రారంభించడంతో నేరుగా విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయడంతో గిరిజన సంక్షేమ శాఖకు చెల్లించే కాస్మొటిక్ చార్జీలను ప్రభుత్వం నిలిపివేసింది. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు సోప్ యూనిట్ నుంచి సబ్బుల కొనుగోళ్లను పూర్తిగా ఆపేశారు.ఈ ప్రభావం సోప్ యూనిట్‌పై పడడంతో ఉత్పత్తిని బాగా తగ్గించేశారు.సోప్ యూనిట్‌ను మూసివేసే నాటికి లక్ష సబ్బులు నిల్వలు ఉన్నాయనీ సిబ్బంది చెపుతున్నారు.గత ఏడాది ఈ యూనిట్‌ను జీసీసీ మార్కెటింగ్ జీఎం సందర్శించి ఈ భవనానికి మరమ్మతులు చేసి వినియోగదారులను ఆకట్టుకునే విధంగా సబ్బుల ఆకారం, ప్యాకింగ్ మార్పు చేసి యూనిట్‌ను పున్నప్రారంభిస్తామని చెప్పారు. అయితే ఇంత వరకు ఎటువంటి స్పందన రాలేదు. ఇక్కడ 24 మంది కార్మికులు పని చేస్తున్నారు. ఈ సబ్బు యూనిట్‌లో పని లేకపోవడంతో డిఆర్ డిపో, సూపర్‌బజార్, జీసీసీ కార్యాలయం, గొడౌన్‌లో సర్దుబాటు చేశారు.వీరందరికి ప్రస్తుతం జీసీసీయే జీతాలు చెల్లిస్తుంది.

పున:ప్రారంభించాలి

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమ్మ ఒడి పేరుతో హాస్టళ్లలో విద్యార్థులకు అందించే జిసిసి సబ్బుల సరఫరా నిలిపివేశారు. దీంతో, ఉత్పత్తి చేసిన సబ్బులు నిల్వ ఉండిపోయాయి. 15 ఏళ్ళుగా పనిచేస్తున్న కార్మికులు రోడ్డున పడవలసిన పరిస్థితి వచ్చింది. గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించే ఇలాంటి చిన్న తరహా పరిశ్రమలు ప్రభుత్వమే మూసేస్తుంటే ఉపాధి అవకాశాలు ఎలా వస్తాయి. జిసిసి ఉన్న పరిశ్రమను మూసేయడం ఎంతవరకు సమంజసం. తక్షణం పరిశ్రమను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

పాంగి సింహాద్రి
జిసిసి సోప్ యూనిట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి

హెచ్‌పిసిఎల్‌లో ఎక్స్ఛేంజర్ ట్యూబ్ బండిళ్ల చోరీ

ప్రజాశక్తి -ములగాడ : హెచ్‌పిసిఎల్‌లో రూ.కోటి విలువైన ఎక్స్ఛేంజర్ ట్యూబ్ బండిళ్లు చోరీకి గురయ్యాయి. దీనిపై హెచ్‌పిసిఎల్ మెయింటినెన్స్ సీనియర్ మేనేజర్ ధీర్‌సింగ్ మల్కాపురం క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేసి సీసీ కెమెరా ఆధారంగా విఆర్ యార్డులో ట్యూబ్ బండిళ్లు దొంగిలించినట్లు గుర్తించారు. ఐదు ట్యూబ్ బండిళ్లు ఉన్న ట్రక్కును క్రేన్ సహాయంతో హెచ్‌పిసిఎల్ ఎటిపి నార్త్ గేట్ ద్వారా బయటకు తీసుకెళ్లినట్లు క్రైమ్ పోలీసులు గుర్తించారు. ప్రాథమిక విచారణ అనంతరం సిఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్లో ఒకరైన పిల్లి ప్రశాంత్, హెచ్‌పిసిఎల్‌లో పనిచేస్తున్న కార్మికులు పిల్లి శివ కుమార్, డివి.రెడ్డి, యలమంచిలి పెంటారావుతో పాటు మరికొందరు కలిసి ఈ కుట్రకు పాల్పడ్డారని పోలీసులు నిర్ధారించారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంస్థలో పనిచేసిన ఉద్యోగులందరినీ సిఐఎస్‌ఎఫ్ సిబ్బంది తనిఖీ చేస్తారని, వారే ఇటువంటి పనులకు పూనుకుంటే ఇంకెవరు తనిఖీ చేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. సంస్థ భద్రతపై పలువురు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు.

అమర్ గ్రాఫ్ తగ్గుతోందా ?

పార్టీలో డిప్యూటీ రీజనల్ కో - ఆర్డినేటర్‌కు పరిమితం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు పార్టీలోనూ సముచిత స్థానం లభించడం లేదన్న చర్చ సర్వత్రా సాగుతోంది. రోజురోజుకూ పార్టీలో ఆయన గ్రాఫ్ పడిపోతున్నట్లు కనిపిస్తోంది. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లి నియోజకవర్గ టిక్కెట్ ఇవ్వకుండా తప్పించిన వైసిపి అధిష్టానం పార్టీ పదవుల్లోనూ ప్రాధాన్యత లేకుండా చేస్తోంది. అనకాపల్లి సమన్వయకర్తగా మలసాల భరత్‌కుమార్‌ను నియమించడంతో భావోద్వేగానికి గురై అమర్ కన్నీరు పెట్టినా కనికరించినట్లులేదు. ఎక్కడ నుంచి అమర్ పోటీచేసినా ఓటమిపాలవుతారని వైసిపి అధిష్టానం దగ్గరవున్న నివేదికలతో వచ్చే ఎన్నికల్లో ఎక్కడా టిక్కెట్ ఇవ్వకూడదన్న అభిప్రాయానికి పార్టీ వచ్చినట్లు సమాచారం. ప్రజలతో సరిగా ప్రత్యక్ష సంబంధాల్లేకపోవడం, ఉన్న వాటిని నిలబెట్టుకోలేకపోవడం వంటి కారణాలతో అమర్‌ను ఎన్నికలకు దూరంపెట్టాలని ఆలోచనకు వచ్చినట్లు పార్టీ నాయకులు చెబుతున్నారు. మంత్రి అయ్యాక పార్టీ కార్యకర్తలనే కాదు, నాయకత్వాన్ని సైతం కలుపుకొని వెళ్లలేదన్న విమర్శలు ఆయనపై ఉన్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ బాధ్యతలు అప్పగించినా ఎన్నికల సమయంలో తలనొప్పిగా మారుతుందని గ్రహించి, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా డిప్యూటీ రీజనల్ కో-ఆర్డినేటర్‌గా అమర్‌ను పార్టీ నియమించినట్టు పలువురు చెబుతున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పట్ల అమర్ ఎంత విధేయత చూపినా ఆయన మాత్రం ఎన్నికల్లో నష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కనబడుతోంది. దశల వారీగా ప్రాధాన్యత తగ్గిస్తూ వస్తున్నట్టు అర్థమవుతోంది. తాజాగా డిప్యూటీ రీజనల్ కో - ఆర్డినేటర్‌గా నియమితులైన అమర్ రీజనల్ కో - ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పనిచేయాల్సివుంది.

మంత్రి అమర్‌నాథ్ (ఫైల్‌ఫొటో)

ఏ పదవీ ఇవ్వలేదని కలత చెందకుండా, పదవి ఇచ్చినట్లే ఇచ్చి ప్రాధాన్యతలేకుండా చేసినట్టు తెలుస్తోంది. యలమంచిలి, పెందుర్తి నియోజక వర్గాల్లో ఒక చోట నుంచి పోటీ చేయాలన్న ఆలోచన అమర్‌కు వున్నా జగన్మోహన్‌రెడ్డి టిక్కెట్ ఇవ్వడానికి సుముఖంగా లేరని తెలిసింది. ఎన్నికల వరకు పార్టీ అప్పగించిన బాధ్యతలకు అమర్‌ను పరిమితం చేయాలన్న యోచనలో జగన్ ఉన్నట్టు కనిపిస్తోంది.

జగన్ పర్యటనను విజయవంతం చేయాలి

ఏర్పాట్ల పరిశీలనలో రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న

ఎసిఎ విడిసిఎ స్టేడియంలో ఏర్పాట్లును పరిశీలిస్తున్న ప్రద్యుమ్న

ప్రజాశక్తి - విశాఖపట్నం : అధికారులందరూ సమన్వయంతో వ్యవహరించి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖ పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ పిఎస్.ప్రద్యుమ్న జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ నెల 13న విశాఖ వేదికగా జరిగే 'ఆడుదాం - ఆంధ్ర' ముగింపు వేడుకలకు ముఖ్యమంత్రి విచ్చేస్తున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునతో కలిసి ఎసిఎ క్రికెట్ స్టేడియంలో ఆదివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకు ముందు అధికారులంతా స్టేడియంలో సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రద్యుమ్న మాట్లాడుతూ సమన్వయ లోపం తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. పూర్తి స్థాయిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రాష్ట్రంలో నిర్వహిస్తున్న మొదటి కార్యక్రమం ఇదేనని తెలిపారు. 13వ తేదీ సాయంత్రం జరిగే కార్యక్రమ షెడ్యూల్‌ను అధికారులకు వివరించారు. అన్ని విభాగాల అధికారులు చేపట్టాల్సిన చర్యలపై మార్గనిర్దేశకాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం, పోలీసు యంత్రాంగం సమన్వయ ఏర్పాట్లు చేస్తోందని పేర్కొన్నారు. క్రీడాకారులతో పాటు సాధారణ ప్రజలకు ఆహారం, తాగునీటి సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమం సజావుగా జరిగేందుకు జిల్లా యంత్రాంగం, పోలీసు, శాప్ నుంచి ఒక్కొక్క ఇన్‌ఛార్జిని నియమిస్తున్నామని వెల్లడించారు. స్టేడియం లోపల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా, వీక్షకులు వచ్చి కూర్చునేందుకు అనువుగా అన్ని ఏర్పాట్లూ చేస్తున్నామని వివరించారు. స్టేడియం లోపల ముఖ్యమంత్రి ప్రసంగించేందుకు అనువుగా ప్రధాన స్టేజీ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య శిబిరాలు, పారిశుధ్య నిర్వహణ తదితర ఏర్పాట్లు పక్కాగా చేస్తున్నామని తెలిపారు. స్టేడియం వద్ద సమావేశం అనంతరం జిల్లా అధికారులంతా మధురవాడ ఐటి హిల్స్ వద్ద ఏర్పాటు చేస్తున్న హెలీప్యాడ్‌ను పరిశీలించారు. సమావేశంలో శాప్ ఎమ్‌డి ధ్యాన్‌చంద్ర, పోలీస్ జాయింట్ కమిషనర్ ఫకీరప్ప, జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, ఎడిసి కెఎస్.విశ్వనాథన్, డిసిపి మణికంఠ, ఈవెంట్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కుటుంబం ఆత్మహత్యాయత్నం
- యజమాని మృతి

ప్రజాశక్తి-పద్మనాభం : అప్పులు, అనారోగ్యం కారణంగా పద్మనాభం మండలంలోని పాండ్రంగి పంచాయతీ ఏనుగులపాలెంలో ఓ కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... ఏనుగులపాలెం గ్రామానికి చెందిన కొమ్మూరి చెన్నయ్య (49) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మద్యానికి బానిసయ్యాడు. మద్యానికి, పిల్లల చదువులకు ఫైనాన్స్ వాడాడు. ఫైనాన్స్ తీర్చడానికి మరిన్ని అప్పుడు చేశాడు. అతని భార్య మంగ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. వీటన్నింటితో మనస్థాపం చెంది శనివారం సాయంత్రం చెన్నయ్య మద్యం తాగి ఇంటికి వెళ్లి అందరమూ చనిపోదామని భార్య, ఇద్దరు ఆడపిల్లలతో చెప్పి నలుగులూ నిద్రమిత్రాలు మింగారు. అందరూ స్పృహ తప్పి పడిపోయారు. దీన్ని గమనించిన చెన్నయ్య తమ్ముడు కొమ్మూరి వెంకన్న 108కి, పోలీసులకు సమాచారం అందించారు. 108 సిబ్బంది వచ్చేసరికి ఇంటి యజమాని చెన్నయ్య మృతిచెందాడు. తల్లి, ఇద్దరు పిల్లలను ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించారు. వారి ఆరోగ్యం బాగానే ఉంది. అప్పటికే మద్యం తాగి ఉండటం, తర్వాత నిద్ర మాత్రలు మింగటంతో చెన్నయ్య మృతిచెందాడు. పద్మనాభం సిఐ నేతృత్వంలో ఎస్ఐ జె.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం గ్రామంలోని బహిరంగ ప్రదేశంలో పేకాటాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి, నలుగురు పేకాట ఆడుతుండగా పట్టుకున్నామని, నిందితుల నుంచి రూ. 4260 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- కె.కోటపాడు : పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్న భర్తను భార్య నిలదీయడంతో మనస్థాపంతో గడ్డి మందు తాగి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వివరాలివి.

మండలంలోని చౌడువాడ గ్రామానికి చెందిన శానాపతి అంజి (37) అనారోగ్యంతో బాధపడుతూ, నెల రోజులుగా పనిలోకి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. భర్త పనికి వెళ్లడం లేదని భార్య లక్ష్మి నిలదీయడంతో, మనస్థాపం చెంది శనివారం సాయంత్రం కలుపు నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా, ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృత్యువాత పడ్డాడు.అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

కంటైనర్ లారీ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి - కశింకోట : మండలంలో బయ్యవరం జాతీయ రహదారిపై స్కూటీని కంటైనర్ లారీ ఢీకొన్న ఘటనలో ఆదివారం మహిళ మృతి చెందింది. మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. సిఐ వినోద్‌బాబు తెలిపిన వివరాలివి. చోడవరం మండలం అంబేరుపురం గ్రామానికి చెందిన దంపతులు కాశీ కనక శ్రీదేవి (40), కాశీ రాములు బైక్‌పైఎలమంచిలి మండలం ఏటికొప్పాకలోని బంధువుల ఇంటికి వెళుతుండగా, అదే మార్గంలో వెనుక నుంచి వస్తున్న కంటైనర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడి తీవ్రగాయాలైన కనక శ్రీదేవి అక్కడికక్కడే మృతి చెందింది. భర్త రాముకు తీవ్రగాయాలు కావడంతో అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వినోద్‌బాబు తెలిపారు.

అప్సా రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీగా భాస్కరరావు

ప్రజాశక్తి -గాజువాక : తిరుపతిలో జరిగిన ఎపి ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) రాష్ట్ర మహా సభలో భాస్కర్ విద్యానికేతన్ కరెస్పాండెంట్ పాలవలస భాస్కర రావును అసోసియేషన్ రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర, వివిధ జిల్లాలకు సంబంధించి నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకొని ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ, అప్సా సంఘం రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కువమంది సభ్యులను చేర్పించి, ప్రతి సభ్యుని సంక్షేమానికి కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ సభ్యులు సుందరాం, చంద్రశేఖర్, రాము, రవీంద్ర, రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రమణ్యం రాజు, సెక్రటరీ సింహాచలం, జనార్ధన్, శ్రీహరి, గణపతిరావు పాల్గొన్నారు.

మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ

ప్రజాశక్తి -రంపచోడవరం: పౌష్టికాహారం, ఆకుకూరలు తింటే రక్తహీనతను నివారించవచ్చని వేద స్పైన్ సెంటర్ గైనకాలజిస్ట్ డాక్టర్. పి లక్ష్మి మదుల అన్నారు. ఆదివారం రంపచోడవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వేద స్పైన్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్. లక్ష్మి మదుల మాట్లాడుతూ. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే, పుట్టిన బిడ్డతో పాటు తల్లి ఆరోగ్యంగా ఉంటుందని, ప్రసవ సమయంలో ప్రాణాపాయ ప్రమాదం లేకుండా ఉంటుందన్నారు. గర్భిణులు ఐరన్ పోలిక్ యాసిడ్ టాబ్లెట్లను విధిగా వాడాలన్నారు. డాక్టర్ తేజో ఫణీంద్ర మాట్లాడుతూ దేశంలో ఊపిరితిత్తులు టిబి తర్వాత వెన్నుముక టిబి ఎక్కువగా వస్తుందన్నారు. పోషకాహారం లోపం వల్ల, వ్యాధినిరోధకశక్తి తగ్గి గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా వెన్నుముక క్షయవ్యాధి బారిన పడుతున్నారన్నారు. దీన్ని అశ్రద్ధ చేస్తే, కాళ్లలో బలహీనత వచ్చి పక్షవాతం వచ్చే అవకాశం ఉందన్నారు. నడుము నొప్పితో పాటు. జ్వరంతోపాటు బరువు, ఆకలి తగ్గితే వెన్నెముక వైద్యనిపుణులను సంప్రదించాలని సూచించారు..శిబిరాన్ని గ్రామ సర్పంచ్ మంగా బొజ్జయ్య సందర్శించి, రోగులకు మందులు పంపిణీ చేశారు. చుట్టు పక్కల గ్రామాల పెద్దసంఖ్యలో రోగులు వచ్చి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

కారంగూడెంలో 'పల్లెకు పోదాం'

ప్రజాశక్తి - చింతూరు: మండలంలోని కారంగూడెం గ్రామంలో బిజెపి మండల అధ్యక్షుడు దాసరి వెంకట సూర్య రమణారెడ్డి (చిట్టిబాబు) ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మన సంకల్పం భారత్ అనే కేలెండర్‌ను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో బిజెపిని మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వీర్రాజు, కారం చుక్కమ్మ , మడివి రాజమ్మ, కారం లాలమ్మ, కారం రంగమ్మ, కారం కన్నమ్మ, మడకం.దులయ్య పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థకు జివిఎంసి సెస్ బకాయి రూ.140 కోట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థకు జివిఎంసి రూ.140 కోట్లు సెస్ బకాయి పడిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్ గాంధీ తెలిపారు. బకాయి సొమ్మును చెల్లించాలని జివిఎంసి కమిషనర్ సాయి కాంత్ వర్మకు ఇటీవల వినతి పత్రం సమర్పించినట్టు చెప్పారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా భారీ మొత్తంలో సెస్ బకాయి పడిందన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసి ఈ విషయమై విజ్ఞప్తి చేయగా ఆయన ఆదేశాల మేరకు ప్రతి నెలా రూ.50 లక్షలు చొప్పున జివిఎంసి జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించేందుకు అంగీకరించిందన్నారు.

అంగీకరించిన మేరకు రూ.50 లక్షలు చొప్పున జివిఎంసి చెల్లిస్తూ వచ్చినప్పటికీ నాలుగు మాసాలుగా ఆ సొమ్మును చెల్లించడం లేదన్నారు. వెంటనే బకాయి చెల్లించాలని కోరారు. తాను ఛైర్మన్‌గా బాధ్యత చేపట్టిన తర్వాత జగదాంబ జంక్షన్ సమీపంలో ఉన్న తమ సంస్థ ఎకరా స్థలంలో రూ.24 కోట్లతో జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన భవనాన్ని నిర్మించాలని ప్రతిపాదించామని, ఈ మేరకు అంచనాలు సిద్ధం చేశామని అన్నారు. అందుకోసం రూ.2 కోట్లను గ్రంథాలయ సంస్థ నుంచి నిధుల రూపంలో విడుదల చేశామన్నారు. అనుకున్న విధంగా నూతన భవన నిర్మాణం జరగాలంటే జివిఎంసి బకాయి ఉన్న మొత్తం సొమ్మును చెల్లించాల్సి ఉందన్నారు. ఇటీవల జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించామని, రూ.25 కోట్లా 90 లక్షల అంచనా బడ్జెట్‌ను ఆమోదించామని తెలిపారు.